ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

5

సోమవారం 11 నవంబరు 2024

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

పరిగి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కృషితో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయని డీసీసీ ప్రధానకార్యదర్శి కె.హన్మంత్‌ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ అన్నారు. సయ్యద్‌మల్కాపూర్ నుంచి పరిగి వరకు కొన్నేళ్లుగా గుంతలమయంగా ఉన్న రోడ్డు విస్తరణ పనులను ఆదివారం వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్, నాయకులు ఆనెం ఆంజనేయులు, అక్బర్, రహీంపటేల్, ఏజాజ్, మైపాల్ పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి రద్దు

» మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ నవంబరు 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్‌లో ఈనెల 11న జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తునట్లు కలెక్టర్ గౌతమ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతున్నందున, జిల్లా యంత్రాంగంతో పాటు అధికారులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఈ క్రమంలో ప్రతీ సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా నేడు జరిగే ప్రజావాణిని రద్దు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదుదారులు కలెక్టరేట్‌కు వచ్చినా ఆర్జీలు స్వీకరించరన్నారు. జిల్లా ప్రజలు గమనించాలని కలెక్టర్ గౌతమ్ కోరారు.

కార్తీక సందడి



చీర్యాల్ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల క్యూ





కీసరగుట్టపై శివలింగాలకు అభిషేకం చేస్తున్న భక్తులు

కార్తీకమాసం పురస్కరించుకొని ఆదివారం సెలవు రోజు కావడంతో కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి, చీర్యాల్ లక్ష్మీనరసింహస్వామి ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. కీసర రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి శ్రీ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేయగా, లక్ష్మీ నరసింహస్వామికి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. ఈ మేరకు భక్తులు స్వామివార్లకు దర్శించుకున్నారు. కీసరగుట్టలోని శివలింగాలకు అభిషేకాలు చేసి కార్తీక దీపాలు వెలిగించగా, చీర్యాల్‌లో సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరించి తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో కీసర ప్రధాన చౌరస్తా వద్ద ట్రాఫిక్ స్తంభించింది.

- కీసర, నవంబరు10 (ఆంధ్రజ్యోతి)

పూడ్చేస్తున్నారు

» తిప్పవాడికుంటపై రియల్టర్ల కన్ను » కన్నెత్తి చూడని అధికారులు



తిప్పవాడికుంటను పూడ్చేస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు

కీసర, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓవైపు రాష్ట్ర ప్రభుత్వం చెరువులు, కుంటలను పరిరక్షిస్తుంటే రియల్టర్ల ఆగడాలు తగ్గడం లేదు. అంకిరెడ్డిపల్లిలో రియల్టర్లు ఏకంగా ఓ కుంటను పూడ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడమే దీనికి నిదర్శనం. వివరాల్లోకి వెళితే.. అంకిరెడ్డిపల్లి గ్రామం సర్వేనంబర్ 154లో తిప్పవాడికుంట దాదాపు రెండెకరాలు ఉంటుంది. కుంటను అనుకొని గ్రామస్థుల పట్టాభూమి కూడా ఉంటుంది. కాగా ఇటీవల పట్టాభూమి కొనుగోలుకు కొంతమంది రియల్టర్లు బేరసారాలకు దిగారు. పట్టాభూమితో పాటు కుంటస్థలాన్నీ కబ్జా చేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు గ్రామంలో జోరుగా ప్రచారం జరుగుతోంది. కుంటను పూడ్చే క్రమంలో భాగంగా రెండు లారీల సాయంతో రాళ్లను కుంటలోకి వేసి పూడ్చేస్తున్నారు. చెరువులు, కుంటలు కబ్జా చేసినా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో నిర్మాణాలు చేపట్టినా అధికారులు హైడ్రా పేరుతో వాటిని కూల్చివేసి, హద్దురాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. అయినప్పటికీ రియల్టర్లు బరితెగించి కుంటను పూడ్చివేస్తుండటం గమనార్హం. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు వెంటనే చర్యలు తీసుకొని తిప్పవాడికుంట కనుమరుగు కాకుండా సర్వేచేసి, హద్దురాళ్లను ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కబ్జా చేస్తే సహించం



తిప్పవాడికుంటను కబ్జాచేస్తే సహించేది లేదు. కుంటలే కాదు, చెరువులు కబ్జా చేసిన వారిపై చర్యలు తప్పవు. అదేవిధంగా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో నిర్మాణాలు చేపట్టినా చట్టపరంగా వాటిని కూల్చేస్తాం. ప్రభుత్వస్థలాలు ఆక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు.

- అశోక్, తహసీల్దార్, కీసర

జోరుగా ఇసుక దందా!



పరిగిలో అన్‌లోడింగ్ చేస్తున్న ఇసుక

అనుమతులకు మించి అక్రమ రవాణా

ఇళ్లు నిర్మించుకునే వారికి, ప్రభుత్వ పనుల కోసం సర్కారు ఇసుక లభ్యతను సులభతరం చేసింది. ఇదే అదనుగా వ్యాపారులు సిండికేట్‌గా మారి ఇసుక అక్రమ దందాకు తెరలేపారు. పరిగి డివిజన్‌లో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. నిర్మాణదారులకు నానా సాకులు చెబుతూ ఇసుక రేట్లను అడ్డగోలుగా పెంచేసి అందినకాడికి దండుకుంటున్నారు. ఇసుకాసురుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

ఒకే వే బిల్లుతో రెండు మూడు లారీల ఇసుక తరలింపు

వ్యాపారుల సిండికేట్.. కృత్రిమ కొరత సృష్టించి అమ్మకాలు

టన్ను ఇసుకకు రూ.2 వేలు.. పట్టించుకోని అధికారులు



పరిగికి వచ్చిన ఓ లారీలో సామర్థ్యానికి మించి నింపిన ఇసుక

పరిగి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పరిగి కేంద్రంగా ఇసుక అక్రమ దందా జోరుగా కొనసాగుతోంది. ప్రభుత్వ అభివృద్ధి పనుల పేరిట కొందరు, ఏలాంటి అనుమతులు లేకుండా మరికొందరు యథేచ్ఛగా ఇసుక వ్యాపారాన్ని నడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇళ్లు నిర్మించుకునే వారికి, ప్రభుత్వ పనుల కోసం ఇసుక లభ్యతను సులభతరం చేసిన సంగతి విదితమే. అయితే వ్యాపారులు ఇళ్ల నిర్మాణాల పేరిట అనుమతితో జోరుగా అక్రమ ఇసుక దందా సాగిస్తున్నారు. ఈ అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట వేయాల్సిన అధికారులే తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పరిగి సబ్ డివిజన్‌లోని ఒక్క లారీ వే బిల్లుతో తీసుకొస్తే మరో రెండు లారీల ఇసుకను దొడ్డి దారిన విక్రయిస్తున్నారు. ఇళ్ల నిర్మాణాల కోసం కొన్ని నెలల నుంచి యాలాల్ మండలంలోని వాగుల నుంచి ఇసుక తీసుకునేందుకు ప్రభుత్వం నిబంధనలను కొంత సులభతరం చేసింది. ఇదే అదనుగా వ్యాపారులు రెచ్చిపోతున్నారు. ఇసుక అక్రమ రవాణాలో

మిగతా 8వ పేజీలో...



ఆటలెప్పటి నుంచో..

» నిరుపయోగంగా తాండూరు ఇండోర్ స్టేడియం

» నెలక్రితం ప్రారంభించి వదిలేశారు



స్టేడియం ఎదుట గడ్డి మేస్తున్న పశువులు

తాండూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తాండూరులో రూ.10 లక్షలు వెచ్చించి ఇండోర్ స్టేడియాన్ని నిర్మించారు. నెల రోజుల క్రితం ఈ భవనాన్ని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అధికారులతో కలిసి ప్రారంభించారు. అంత వరకు బాగానే ఉన్నా.. అప్పటి నుంచి స్టేడియాన్ని అధికారులు వినియోగంలోకి తీసుకురాలేదు. తాండూరు- పెద్దేముల్ రోడ్డు మార్గం అంతారం గ్రామ శివారులోని గుట్టపై ఇండోర్ స్టేడి యాన్ని నిర్మించారు. ఈ స్టేడియంలో బాస్కెట్ బాల్, స్కేటింగ్ , వాలీబాల్, టెన్నికాయిట్, షటిల్, బ్యాడ్మింటన్ ఆటలాడేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే ప్రారంభించి వదిలి వేయడంతో పశువులకు అడ్డాగా మారింది. ఇప్పటికైన అధికారులు వినియోగంలోకి తేవాలని క్రీడాకారులు కోరుతున్నారు.



నారాయణపూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

సర్వే తీరుపై కలెక్టర్ ఆరా

వికారాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను కలెక్టర్ ప్రతీక్ జైన్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆదివారం వికారాబాద్ మండలం నారాయణపూర్ గ్రామంలో పర్యటించారు. ఓ ఇంటి వద్ద అధికారులు చేస్తున్న కులగణను పరిశీలించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ సుధీర్, అధికారులు ఉన్నారు.

రేపటి నుంచి మెథడిస్టు జాతర



ప్రధాన వేదిక వద్ద ఏసుప్రభువు శిలువ

ధారూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ధారూరు క్రిష్టియన్ మెథడిస్టు ఉత్సవాలు ఈనెల 12 నుంచి ప్రారంభంకానున్నాయి. స్టేషన్ ధారూరు, దోర్నాల గ్రామాల మధ్య ఉన్న కాగ్నా ఉపనది పక్కన ఉన్న జాతర ప్రాంగణంలో ఈనెల17 వరకు ఉత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. జాతరకు తెలంగాణ నుంచే కాక మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు విదేశాల నుంచి లక్షలాది మంది క్రైస్తవ భక్తులు తరలివచ్చి ఏసు ప్రభువును దర్శించుకోనున్నారు. జాతరకు వచ్చే భక్తుల కోసం ప్రత్యేక రైళ్లు, బస్సులను ఏర్పాటు చేశారు. ప్రధాన వేదిక ప్రాంతంలోని ఇప్ప చెట్టు, ముఖద్వారం వద్ద ఉన్న ఏసు ప్రభువు శిలువల వద్ద భక్తులు కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఆరు రోజుల పాటు ఏసుక్రీస్తు భజనలు, కీర్తనలతో జాతర ప్రాంగణం హోరెత్తనుంది.

సరదా.. సరదాగా..



అనంతగిరికి ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. ముందుగా అనంతపద్మనాభ స్వామిని దర్శించుకున్న భక్తులు, పర్యాటకులు అనంతరం కొండల్లో పచ్చని ప్రకృతిలో ఆనందంగా గడిపారు. నందిఘాట్ వద్ద ఫొటోలు దిగిన పర్యాటకులు ట్రెక్కింగ్ చేసి అడవిలో పర్యటించారు. పర్యాటకులు పెద్ద ఎత్తున తరలి రావడంతో పార్కింగ్ ఏరియాలో వాహనాలు నిండిపోయాయి.

- వికారాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి)



అనంతపద్మనాభ స్వామిని దర్శించుకున్న న్యాయమూర్తి నాగేష్ భీమపాక

అనంతుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

వికారాబాద్, నవంబరు 10,(ఆంధ్రజ్యోతి): అనంతపద్మనాభ స్వామిని రాష్ట్ర హై కోర్టు న్యాయమూర్తి నాగేష్ భీమపాక దర్శించుకున్నారు. ఆదివారం అనంతగిరికి వచ్చిన ఆయనకు హరిత రిసార్ట్స్‌లో కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్‌రెడ్డిలు స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అక్కడి నుంచి ఆలయానికి చేరుకున్న న్యాయమూర్తికి అర్చకులు, ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ విశిష్టతను వివరించారు. ఈ క్రమంలోఆలయంలో తులసిదళ సేవలు, అర్చనలు నిర్వహించారు. వేద పండితులు ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందజేసి సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆగనూర్ శ్రీనివాస్, ఆలయ ఈవో నరేందర్, అర్చకులు శేషగిరి, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

కళతప్పిన క్రీడా ప్రాంగణాలు

- కరువైన కనీస వసతులు
- ఆట వస్తువుల జాడే లేదు
- గ్రామాలకు దూరంగా ఆటస్థలాలు
- మినీస్టేడియం ఏర్పాటుకు డిమాండ్


పిచ్చిగడ్డితో నిండిన చిన్నతూండ్ల క్రీడా ప్రాంగణం

యాచారం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల పరిస్థితి దయనీయంగా మారింది. ఏ గ్రామంలో నూ ఆటస్థలాలు గ్రామానికి సమీపంలో ఏర్పాటు చేయలేకపోగా వాటిలో ఆడేందుకు కనీస వసతులు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో క్రీడాకారులు ఆయా ప్రాంగణాల్లో ఆటలు ఆడలేకపోతున్నారు. వాటిని పట్టించుకునే వారు లేకపోవడంతో ఆ స్థలాల్లో పిచ్చి మొక్కలు, గడ్డి ముళ్లకంపతో నిండిపోయాయి. ఖోఖో, వాలీబాల్, కోర్టులతో పాటు లాంగ్‌జంప్, హైజంప్ చేసుకునేందుకు కనీస వసతులు ఏర్పాటు చేయడంలో పంచాయతీలు సైతం విఫలమయ్యాయి.క్రికెట్ కిట్‌లు పంపించిన అధికారులు క్రికెట్ ఆడేందుకు అనువైన స్థలం ఏ గ్రామంలోని క్రీడా ప్రాంగణాల్లో ఏర్పాటు చేయలేకపోవడం గమనార్హం.

మొక్కుబడిగా కిట్ల పంపిణీ

రెండేళ్లక్రితం అప్పటి ప్రభుత్వం మొక్కుబడిగా క్రీడాకిట్లు పంపిణీ చేసింది. క్రికెట్ బ్యాట్లు, బంతులు. వాలీబాల్‌లు, నెట్‌లు, డంబెల్స్ పంపించారు. కానీ నేడు అవి ఎక్కడ ఉన్నాయో ఎవరికీ తెలియడం లేదని క్రీడాకారులు వాపోతున్నారు. మండలంలోని చిన్నతూండ్లలో బడరాళ్లమధ్యన వ్యాయమం చేయడానికి ఇనుపరాడ్లు బిగించారు. ప్రమాదవశాత్తు కింద జారి పడితే ప్రాణాలు గాలిలో కలవడం ఖాయమని క్రీడాకారులు ఆందోళన చెందుతున్నారు. వ్యాయమం చేసేచోట భారీ బండ రాళ్లుండడంతో వ్యాయమం చేయడానికి వీలు లేకుండాఉంది. అలాగే నజ్దిక్‌సింగారంలో గ్రామానికి కిలోమీటర్నన్నర దూరంలో క్రీడా ప్రాంగణం ఉంది. కుర్మిద్దలో ఓ వెంచర్‌లో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేశారు. గ్రామానికి దగ్గరగా ఉన్నా అందులోకి వెళ్లకుండా ఆ వెంచర్ యజమాని వెంచర్‌కు ప్రహరీ నిర్మించి తాళం వేయడంతో ఆటలు ఆడలేకపోతున్నామని క్రీడాకారులు ఆందోళన చెందుతున్నారు. గేటుకు తాళం వేసిన విషయమై ఎంపీవోతో ప్రస్తావించగా తనిఖీ చేసి చర్యలు తీసుకుంటామని దాటవేశారు.


బండరాళ్ల మధ్యన ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు

ఇతర అవసరాలకు వద్దంటూ..

మేడిపల్లిలో గ్రామానికి కిలోమీటర్ దూరంలో ఆటస్థలం ఉండగా అందులో ఆటలు ఆడటానికి వీలు లేకుండా ఉంది. యాచారం మండల కేంద్రంలో 1.5కి.మీ దూరంలో ఉంది. మేడిపల్లిలో ఫార్మాసిటీ కోసం సేకరించిన భూమిలో విశాలమైన స్థలం ఉందని దాంట్లో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేయాలని యువకులు గ్రామ యువకులు కోరుతున్నారు. ఇందులో యువకులు రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్ ప్రాక్టీస్ చేస్తుంటారు. ఇక్కడ మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని స్థానిక యువత డిమాండ్ చేస్తున్నారు. ఇందులో మండలస్థాయి మినీ స్టేడియం కోసం తప్ప ఇతర అవసరాలకు వాడితే ఆందోళన చేపడతామని యువకులు, ప్రజా ప్రతినిధులు చెప్పారు. కాగా ప్రభుత్వం ఒక్కో క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు రూ. మూడు లక్షల ధనం వెచ్చించారు. యాచారం, కొత్తపల్లి గ్రామాలకు ఇంత వరకు బిల్లులు రాలేదు.

తాళం తీసేయించి, శుభ్రం చేయాలి



మా గ్రామంలో వెంచర్‌లో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేశారు. అందులోకి వెళ్లకుండ వెంచర్ నిర్వాహకుడు తాళం వేశారు. అలాంటప్పుడు అందులో ఎందుకు ఏర్పాటు చేశారో అధికారులు సమాధానం చెప్పాలి. క్రీడాప్రాంగణం అంతా గడ్డితో నిండి ఉంది. అందులోకి వెళ్లాలంటే యువకులు జంకుతున్నారు. పంచాయతీ అధికారులు వెంచర్ గేటు తాళం తీసేసి ప్రాంగణాన్ని పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించాలి. అలాగే ఆట వస్తువులు ఇప్పించాలి. - ప్రభు, కుర్మిద్ద క్రీడాకారుడు

మొక్కుబడిగా క్రీడాప్రాంగణం ఏర్పాటు



మా గ్రామానికి 1.5కి.మీ దూరంలో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేశారు. అంత దూరం వెళ్లలేక క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ ప్రాంగణంలో ఓ గది కట్టించడంతో పాటు తాగు నీటి వసతి కల్పించాలి. మొక్కుబడిగా క్రీడాప్రాంగణం ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. - వి. రవీందర్‌రెడ్డి, నజ్దిక్‌సింగారం


సర్వే బూత్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డీవో వెంకట్‌రెడ్డి

సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

రాజేంద్రగనర్ ఆర్‌డీవో వెంకట్‌రెడ్డి

శంషాబాద్ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రాజేంద్రగనర్ ఆర్‌డీవో వెంకట్‌రెడ్డి సూచించారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని సమగ్ర సర్వే బూత్‌లను తహసీల్దార్ రవీందర్ దత్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన వారికి సంక్షేమ పథకాలుఅ అందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. సర్వేకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరిస్తేనే అసలైన అర్హులకు సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. సిబ్బంది ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ముందువెళ్లాలని సూచించారు. ఎన్యుమరేటర్లకు ఇబ్బందులు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సర్వేపై ప్రజలకు సందేహాలు ఉంటే తక్షణమే నివృత్తి చేసుకోవాలని సూచించారు. సర్వే నిర్వహించే ప్రాంతాల్లో ముందుగా వారికి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ కృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వివరాల సేకరణలో తప్పులు ఉండొద్దు

మహేశ్వరం: సమగ్ర సర్వే వివరాల సేకరణలో ఎలాంటి తప్పులు లేకుండా అన్ని వివరాలతో కూడిన సమాచారాన్ని సేకరించాలని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి ఎన్యూమరేటర్లకు సూచించారు. మహేశ్వరం మండలంలోని సిరిగిరిపురం గ్రామంలో ఆదివారం నిర్వహించిన సమగ్ర సర్వే వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సంబంధిత కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను అడిగి తెలుసుకోవాలన్నారు. ఆయన వెంట మండల తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో శైలజ, సీడీపీవో శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు నొక్కేశారు!

ఆమనగల్లు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వైద్య చికిత్స చేయించుకున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) ద్వారా మంజూరైన ఆర్థిక సాయం చెక్కుల్లో అక్రమాలు చోటుచేసుకున్నట్లు సమాచారం. 2022లో, 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం జారీ చేసిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కొందరు వ్యక్తులు అక్రమంగా డ్రా చేసినట్లు తెలిసింది. రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన పలువురు పేదలు గత ప్రభుత్వంలో సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తులు చేసుకున్నా ఇప్పటికీ చెక్కులు అందలేదు. దీంతో అనుమానం కలిగి సీఎంఆర్‌ఎఫ్ ఉన్నతాధికారులను కలిసి తమ దరఖాస్తులు ఏమయ్యాయని అడిగారు. ఏడాదిక్రితమే చెక్కులు విడుదల చేశామని, డబ్బు కూడా డ్రా అయ్యిందని అధికారులు తెలపడంతో అవాక్కయ్యారు. వైద్య చికిత్సల కోసం నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుంది. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు నేరుగా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకునే వెసులుబాటు లేకపోయింది. స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ సిఫారసు లేఖతో దరఖాస్తు చేయాల్సి వచ్చేది. మంజూరైన చెక్కులను ప్రభుత్వం నేరుగా లబ్దిదారులకు కాకుండా సిఫారసు చేసిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలకు ఇస్తుండేది. ఈ క్రమంలో కొన్ని చెక్కులను కల్వకుర్తి నియోజవకర్గంలో ఓ మాజీ ప్రజా ప్రతినిధి పీఏ, అనుచరులు డ్రా చేసుకున్నట్లు సమాచారం. లబ్ధిదారుల ఇంటిపేరు పూర్తిగా కాకుండా ఇంగ్లిషులో ఒకే అక్షరంతో ఉండడంతో ఆ పీఏ, అనుచరులు అక్రమంగా డ్రా చేసుకోవడానికి వీలు కలిగిందని సమాచారం. అదే అక్షరంతో మొదలయ్యే ఇంటిపేరు, అదే పేరు కలిగిన తమకు తెలిసిన వ్యక్తుల ఖాతాల్లోకి ఆ డబ్బు మళ్లించారని తెలిసింది. ఈ విషయం వెలుగు చూడడంతో వారు దరఖాస్తుదారుల కాళ్లావేళ్లా పడుతున్నట్లు సమాచారం. తాజాగా ఆ పీఏను నిలదీయగా శనివారం రాత్రి లక్ష రూపాయలు ఇచ్చి ఎక్కడా చెప్పొద్దని ప్రాధేయపడినట్లు తెలిసింది. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి కూడా వెళ్లగా విచారణకు ఆదేశించినట్లు తెలిసింది.

తప్పులు లేకుండా వివరాలు సేకరించాలి

తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్


సర్వే బుక్‌లెట్‌ను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

తాండూరు, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే ఫార్మేట్‌ను ఎలాంటి తప్పులు లేకుండా నింపాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ సూచించారు. ఆదివారం తాండూరు పట్టణంలోని హేరూర్ వార్డులో కొనసాగుతున్న సర్వే తీరును ఆయన పరిశీలించారు. ఆ సమయంలో ఎన్యూమరేటర్ రాస్తున్న ఫారంను తీసుకొని పరిశీలించారు. అనంతరం ఒక ఫారం నింపడానికి ఎంత సమయం పడుతుంది? సమస్యలు ఏమైనా వస్తున్నాయా? అంటూ ఎన్యూమరేటర్‌ను అడిగారు. ఎన్యూమరేటర్ మాట్లాడుతూ ఒక ఫారం నింపేందుకు 45 నిమిషాల నుంచి గంట సమయం పడుతోందని వివరించారు. ఆయన వెంట సబ్ కలెక్టర్ కార్యాలయం అధికారి మాణిక్ రావు, మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే దేశానికే ఆదర్శం

మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్లార్



మహేశ్వరం, నవంబరు 10 ?(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్థిక, సామాజిక అసమానతలు తొలగించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తలపెట్టిన సమగ్ర కుటుంబ సర్వే దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. ఈ సర్వేకు కాంగ్రెస్ శ్రేణులు పూర్తిగా అధికార యంత్రాంగానికి సహకరించాలని ఆయన కోరారు. ఆదివారం తుక్కుగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అభివృద్ధి ఫలాలు పేద వర్గాలకు అందేలా కాంగ్రెస్ కృషి చేస్తుందన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం జరగాలంటే కుల గణన సర్వే అవసరమని అన్నారు. ప్రభుత్వం చిత్త శుద్ధితో చేపట్టబోయే ఈ సర్వేపై విపక్షాలు అనవసర రాద్ధాంతం చేయకుండా సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. నవంబరు 14 నుంచి డిసెంబరు 9 వరకు 26 రోజుల పాటు రాష్ట్రంలో ప్రజా విజయోత్సవాలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో విజయవంతంగా ఏడాది పాలన పూర్తి కావస్తున్నందున విజయోత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

దైవానికి సేవచేయడం అదృష్టం

మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు


నూతన పల్లకీకి పూజ చేస్తున్న బక్కని నర్సింహులు, దాత బాల్‌రాజ్

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేవుడికి సేవ చేసే భాగ్యం అందరికి రాదని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు అన్నారు. షాద్‌నగర్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి స్థానిక వ్యాపారి పలబట్ల బాల్‌రాజ్‌గుప్తా నూతన పల్లకీని సమర్పించారు. ఆ పల్లకీకి ఆలయ ప్రధాన పూజారి శ్రీనివాసచార్యులు శనివారం రాత్రి బక్కని నర్సింహులు చేత పూజ చేయించి, ఆలయానికి సమర్పించారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ దేవుడికి కావాల్సిన వస్తువులను భక్తి, ప్రేమగుణం, పరోపకార బుద్ధి ఉన్న వారి నుంచే స్వీకరిస్తారని అన్నారు. ఏ కష్టం వచ్చినా దేవుడికే మొక్కుతామని, అదే దేవుడి సేవకు అవసరమైన వస్తువులు ఇచ్చే అవకాశం రావడం అదృష్టమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలబట్ల బాల్‌రాజ్‌గుప్తాను బక్కని నర్సింహులు అభినందించారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు పరిగి వెంకట సాయిశ్వర్‌రెడ్డి, లింగారం కుమార్‌గౌడ్, ఆర్.కృష్ణయ్య, ఒగ్గు కిషోర్, డాక్టర్ మల్లప్ప, ఎం.కుమార్, వేముల బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంపై దాడి చేసిన వారిని శిక్షించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న హిందూ సంఘాల నాయకులు

కేశంపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండలం జూకల్ గ్రామంలో గ్రామ దేవతల ఆలయంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని హిందూ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కేశంపేట మండలం కేంద్రంలో ఆదివారం ఆలయంపై జరిగిన దాడికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. హిందూ ఆలయాలు, హిందూ దేవతల విగ్రహాలపై దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఇది ప్రజాస్వామ్యానికి మంచిదికాదని హితవు పలికారు. దాడికి తెగబడుతున్న వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప సాములు తిరుమలయ్య గౌడ్, పాండు గౌడ్, పవన్ కుమార్ రెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డి, గ్రామస్తులు రమణ గౌడ్, బైకని శేఖర్, అనసూయమ్మ, శంకర్, దశరథ్, బ్రహ్మాచారి, టీ.పాండు, శివ గౌడ్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బైక్ రైడర్ మృతి

తూప్రాన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్ రైడర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మన్సూరాబాద్ రాక్‌హిల్స్ కాలనీకి చెందిన దల్జిత్‌సింగ్(37), సఫిల్‌గూడ్ మల్కాజిగిరికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సాగర్ సంతోశ్‌గౌడ్‌లు వేర్వేరు వాహనాలపై బైక్ రైడ్‌కు ఆదివారం ఉదయం బయలుదేరారు. హైవే 44 మీదుగా వెళ్తుండగా తూప్రాన్ పట్టణ శివారులోని కరీంగూడ చౌరస్తా వద్ద పార్కింగ్ లైట్లు, ఇండికేటర్లు లేకుండా రోడ్డుపై నిలిపిన లారీని దల్జిత్‌సింగ్ బైక్‌తో ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన దల్జిత్‌సింగ్‌ను 108 అంబులెన్స్‌లో మేడ్చల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దల్జిత్ సింగ్ తండ్రి కుల్వంత్ సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పదేళ్లలో అభివృద్ధి పథంలో దేశం


మాట్లాడుతున్న ఈశ్వర్

పరిగి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పదేళ్లలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని స్వదేశీ జాగరణ మంచ్ రాష్ట్ర కో-కన్వీనర్ ఈశ్వర్ అన్నారు. శ్రీదత్తుపంత్‌జీ జయంతిని పురస్కరించుకుని స్వదేశీ జాగరణమంచ్ ఆధ్వర్యంలో ఆదివారం పరిగిలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్వదేశీ జాగరణ మంచ్ రాష్ట్ర కో-కన్వీనర్ ఈశ్వర్ మాట్లాడుతూ.. దేశం 500 ఏళ్ల కిందట స్వయం సమృద్ధి దేశంగా ఉండేదన్నారు. కాలక్రమేనా ఇతర దేశాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పదేళ్ల నుంచి దేశంలో పరిస్థితులు మెరుగుపడ్డాయన్నారు. దేశంలో కరోనా వ్యాక్సిన్ తయారీ నుంచి యుద్ధ పరికరాల వరకు స్వయంగా తయారు చేసి, ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరిందన్నారు. ఈ కార్యక్రమంలో పాలమూరు విభాగ్ టి.ప్రభాకర్‌రెడ్డి, ఆంజనేయులు, వెంకటయ్య, చాకలి వెంకటేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెద్దజాతరకు అనంతగిరి ముస్తాబు

నేటి నుంచి అనంతుడి కార్తీక ఉత్సవాలు



- 15 రోజులు కొనసాగనున్న ప్రత్యేక పూజలు
- 15వ తేదీన రథోత్సవం.. 25న చక్రతీర్థంతో ముగింపు
- పెద్ద సంఖ్యలో హాజరుకానున్న భక్తులు
- అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసిన నిర్వాహకులు


ముస్తాబైన ఆలయం

వికారాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రం అనంతగిరి శ్రీ అనంతపద్మనాభ స్వామి దేవాలయం కార్తీక మాస పెద్ద జాతరకు ముస్తాబైంది. నేటి(సోమవారం) నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలు 15 రోజులు పాటు కనులపండువగా జరుగున్నాయి. ఈ జాతరకు చుట్టూపక్కల ప్రాంతాల నుంచే కాకుండా హైదరాబాద్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు.

ధ్వజారోహణంతో ప్రారంభం

ఉత్సవాలను నేటి(సోమవారం) సాయంత్రం ధ్వజారోహణంతో ప్రారంభించనున్నారు. 12న కార్తీక ఏకాదశి ఉత్సవం, 13న రాత్రి 7 గంటలకు తులసి వివాహం నిర్వహించి 15న పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి వారి కల్యాణం, రథోత్సవం నిర్వహించనున్నారు. 25న ఉదయం 11 గంటలకు ఆలయ పుష్కరిణిలో చక్రతీర్థం కార్యక్రమంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ అధికారులు, అర్చకులు తెలిపారు.

ముస్తాబైన ఆలయం

జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. భక్తులకు రద్దీ దృష్ట్యా క్యూ ఏర్పాటు చేస్తున్నారు. అదే విధంగా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి ఆలయాన్ని శోభాయానమానంగా తీర్చిదిద్దారు.

పుష్కరిణికి గ్రహణం.. నిరాశలో భక్తజనం



దేవాలయ ఆవరణలో స్వయంగా గంగాదేవి.. అనంతగిరి క్షేత్రానికి వచ్చి పుష్కరిణిగా మారిందని ప్రసిద్ధి. ఇక్కడ స్వామి వారిని దర్శించుకుంటే సకల పాపాలు హరిస్తాయని ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని భక్తుల నమ్మకం. గతంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇక్కడ రెండు మూడు రోజులు ఉండి ఇక్కడే స్నానాలు చేసి స్వామి వారిని దర్శించుకునే వారు. అయితే కాలక్రమేనా పెరిగిన రవాణా వ్యవస్థతో భక్తులు ఉదయం వచ్చి సాయంత్రం వెళ్లిపోతున్నారు. అయితే పుష్కరిణి ఒక సంఘటన ఆధారంగా తాళలు వేసి మూసి వేశారు. పుష్కరిణి నుంచి నీటిని ఒక ట్యాంకులోకి ఎక్కించి ఆ నీటిని నల్లాలు, షవర్ల ద్వారా భక్తులు కాళ్ల చేతులు కడుక్కోవడానికి ఉపయోగిస్తున్నారు. ఒకప్పుడు అనంతగిరి అంటే ముందుగా పుష్కరిణి గుర్తుకు వచ్చేది. కానీ ఇప్పుడు అసలు అక్కడ పుష్కరిణి ఉందా అనే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా పుష్కరిణి మళ్లీ వాడుకలోకి తీసుకువస్తే బాగుంటుందని భక్తులు కోరుతున్నారు. అయితే పుష్కరిణిలో చేపల పెంపకంపై కొందరు దృష్టి పెట్టడం వల్లే ఇలా జరుగుతుందని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భవిష్యత్‌లో బీజేపీదే అధికారం

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

కీసర రూరల్, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్రంలో బీజేపీకి మద్దతు పెరుగుతుందని, భవిష్యత్తులో అధికారంలోకి రావడం ఖాయమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. నాగారం మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు ఆదివారం ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరారు. వారందరికీ ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఆ పార్టీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల విక్రమ్‌రెడ్డి, నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు తిరుమల్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, జంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

మేడ్చల్ టౌన్: మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహద పడుతాయని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ నైబర్ హుడ్ కమ్యూనిటీ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన 10వ, వార్షిక క్రీడల పోటీలను శనివారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ వయసుతో ప్రమేయం లేకుండా అన్ని క్రీడలను ఆడాలన్నారు. అసోసియేషన్ వారు ప్రతీ సంవత్సరం క్రీడల పోటీలను నిర్వహించటం అభినంద నీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, నైబర్ హుడ్ అసోసియేషన్ సభ్యులు మహేష్ రాజు, సందీప్, అభిషేక్, హేమా శంకర్, పాపారావు, బాబు రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన




జయస్తంభ ప్రతిష్ఠాపన వద్ద పూజలు నిర్వహిస్తున్న త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి

శంకర్‌పల్లి, నవంబరు10(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి మున్సిపాలిటీలోని సింగాపురంలో నూతనంగా నిర్మించిన మరకత కార్యసిద్ధి పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా జరిగింది. దాంతో పాటుగా జయస్తంభాన్ని ప్రతిష్ఠించారు. పరమహంస పరివ్రాజకులు త్రిదండి దేవనాథ రామానుజ జీవర్‌స్వామి చేతుల మీదుగా యంత్ర, ఆంజనేయస్వామి విగ్రహ, జయస్తంభ(రాతితో నిర్మించిన స్తంభం), నాభిశిల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ప్రతిష్ఠాత్మకంగా జరిగాయి. అనంతరం ఉత్సవ మూర్తులకు సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. వేద పండితుల ఆశీర్వచనం, రుత్విక్‌ల సన్మానం, మహాప్రసాద సంతార్పణ కార్యక్రమాలు జరిగాయి. త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి భక్తులనుద్దేశించి ప్రవచనాలు వల్లించారు. సత్యం, ధర్మం, అహింసా సిద్ధాంతాలను అలవర్చుకుని ధార్మికంగా జీవించాలని ఆయన బోధించారు. భారతదేశం దేవభూమియని గుర్తు చేశారు. భగవంతుడు సర్వాంతర్యామియని, ఆయన అంతటా విస్తరించి ఉన్నాడని వివరించారు. కార్యక్రమంలో పట్టణ ప్రజలతో పాటుగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం ● పునరావృతం కాకుండా చూడాలంటూ డిమాండ్

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొర్రెముల రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 174లోని 12 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. దాదాపు వంద కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు ఎలా బదలాయిస్తారని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు అక్రమార్కులతో కుమ్మక్కై ప్రభుత్వ భూములను కాజేస్తున్నారని ఆరోపిస్తున్నారు. తప్పుడు పట్టాదారు పాసుపుస్తకాలు సృష్టించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఐదుగురికి పట్టాదారు పాసుపుస్తకాలు రావడానికి సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ భూబదాలయింపుపై సమగ్ర విచారణ జరిపించి ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రొటోకాల్‌పై మాట్లాడడం విడ్డూరం

బీఆర్ఎస్‌పై మండిపడ్డ కాంగ్రెస్ నేత సింగిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

ఘట్‌కేసర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి):బీఆర్ఎస్ నాయకులు ప్రొటోకాల్ గురించి మాట్లాడటం అంటే దయ్యాలు వేదాలు వల్లించడమే అవుతుందని పోచారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి నియోజకవర్గ ఎస్సీసెల్ కన్వీనర్ ప్రవీణ్, హేమంత్ అన్నారు. ఆదివారం పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలో కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత మూడు రోజుల క్రితం టీపీసీసీ ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ బీటీ రోడ్డు పనుల ప్రారంభం సందర్భంగా కొబ్బరి కాయ కొడితే ప్రొటోకాల్ పాటించలేదని నేరుపారేసుకోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 10సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ఎప్పుడైనా ప్రొటోకాల్ పాటించారా ఒక్కసారి గుర్తుచేసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంను పార్టీ కార్యాలయంగా మార్చి చోటమోటా లీడర్ల అడ్డగా మార్చింది ఎవరని ప్రశ్నించారు. అధికారిక కార్యక్రమాల్లో ప్రతిపక్ష ప్రజాప్రతినిధులను ఎనాడైన గౌరవించారా అని నిలదీశారు. రూ. 30లక్షల ప్రత్యేక నిధులు ఇప్పించి పనులను పరిశీలిస్తే జీర్ణించుకోలేని స్థాయికి దిగజారడం విచారకరమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రెడ్డియా నాయక్‌తోపాటు కౌన్సిలర్లు సైతం పాల్గొన్నారని గుర్తు చేశారు. ఇకనైనా ఆపార్టీ నాయకులు గతంను ఒకసారి గుర్తుచేసుకొని మాట్లాడితే బాగుంటుందని అన్నారు. ఇష్టాను సారంగా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో యూసుఫ్, సుదాకర్‌నాయక్, ఎర్ర రాజు, ప్రభాకర్, నాగరాజు, లక్ష్మణ్, మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

భక్తిభావం అలవర్చుకోవాలి

ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి

కేశంపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజలు భక్తిభావం అలవర్చుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. మండల పరిధిలోని లేమామిడి గ్రామంలో ఆదివారం కార్యసిద్ధి రామాంజనేయ ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలకు ఆయన హాజరైయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అంతకుముందు చిదంబరంశర్మ, మఠం శేఖరయ్యల నేతృత్వంలో ఆలయంలో వేదమంత్రోచ్చరణల మధ్య పూజలు చేశారు. అలాగే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌లు గోగు శశివర్ధన్ రెడ్డి, మడగొని శ్రీశైలం గౌడ్, గ్రామస్తులు అమర్‌నాథ్ రెడ్డి, రవీందర్ రెడ్డి, కె. శ్రీనివాస్ రెడ్డి దంపతులు హోమం నిర్వహించారు. కేశంపేట మాజీ జెడ్పీటీసీ పల్లె నర్సింగ్‌రావు, కేశంపేట మాజీ సర్పంచ్ తలసాని వెంకట్ రెడ్డి పూజలలో పాల్గొన్నారు. కార్యక్రమాలలో ఏఎంసీ మాజీ చైర్మన్ వై. యాదయ్య యాదవ్, గూడ వీరేశ్, జగదీశ్వర్, సురేష్ రెడ్డి, యెన్నం శ్రీధర్ రెడ్డి, భాస్కర్ గౌడ్, అనుమగళ్ల రమేష్, కారుణకర్ రెడ్డి, కోడూరు రాములు, రాజేందర్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్, రూప్లానాయక్, అఖిల్, శ్రీనాథ్, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి


యాదవ కులస్తులతో కలసి అభివాదం చేస్తున్న జైపాల్ యాదవ్, శ్రీరాములు యాదవ్

కందుకూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): యాదవులు పాడిపశువులను వృద్ధి చేసుకుంటూనే, విద్యా, రాజకీయ, వ్యాపార రంగాల్లో రాణించాలని షాద్‌నగర్, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, జైపాల్‌యాదవ్ సూచించారు. శనివారం రాత్రి మండల యాదవ సంఘం అధ్యక్షుడు పి.పర్వతాలు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ ఉత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. కందుకూరు సదర్ ఉత్సవంలో పెద్ద సంఖ్యలో యాదవ కులస్తులు పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. అంతకు ముందు దున్నలతో హైదరాబాద్ -శ్రీశైలం జాతీయ రహదారిపై ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మహేశ్వరం ఇన్‌చార్జి అందేల శ్రీరాములు, అశోక్‌కుమార్ యాదవ్, కడారి జంగయ్య, నాయకులు బర్ల జగదీష్, క్రిష్ణ, పవన్, కె.బాల్‌రాజ్, నర్ల రామక్రిష్ణగోవర్ధన్‌యాదవ్, లింగంయాదవ్, నర్ల రాములు, మైసయ్య, జనార్ధన్, ఆంజనేయులు, రాములు, శ్రీశైలం, సత్యం, విశ్వనాథం, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధితో మెరుగైన వైద్యం



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధితో బడుగు బలహీన వర్గాల వారికి మెరుగైన వైద్యం అందుతుందని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. ఎదులాబాద్‌కు చెందిన రాచకట్ల వరలక్ష్మి కుటుంబసభ్యులకు ఆదివారం ఆయన నివాసంలో రూ.22వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగుబలహీన వర్గాల ప్రజలకు సీఎంఆర్ఎఫ్‌తో మెరుగైన వైద్యం అందుతుందని గుర్తుచేశారు. ఆస్పత్రిలో చేరిన వారు సీఎం రిలీఫ్‌ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్న కొద్దిరోజులకు చెక్కులు అందజేస్తున్నట్లు తెలిపారు. సీఎం రిలీఫ్‌ఫండ్ పేదల కు ఓ వరం లాంటిదన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ చందుపట్ల ధర్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ మంకం రవి, నాయకులు రాచకట్ల వెంకటేష్ పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించడమే ధ్యేయం



క్రికెట్ కిట్లను అందజేస్తున్న చైర్మన్ రాజేశ్వర్‌రావు

శామీర్‌పేట, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులను ప్రోత్సహిస్తూ యువతకు సాయం చేయడమే తన ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు అన్నారు. తూంకుంట మున్సిపల్ పరిధిలోని సింగాయిపల్లికి ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి దాత మాదవరం సందీప్‌రావు సహకారంతో క్రికెట్ క్రీడాకారులకు కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. గ్రామీణ యువతను క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ప్రోత్సహించడమే తన ఉద్దేశమని తెలిపారు. క్రీడాకారులు నిత్యం శిక్షణ పొందుతూ అంచలంచెలుగా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాపోటీల్లో రాణించి రికార్డులను నెలకొలపాలని చైర్మన్ హితవు పలికారు. మున్సిపల్ పరిధిలోని క్రీడాకారులకు చేయూతనిస్తానని చైర్మన్ భరోసా ఇచ్చారు. మున్సిపల్ కౌన్సిలర్ సురేశ్, తదితర నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలి



సంబురంలో గ్రాడ్యుయేషన్ పట్టాలు పొందిన విద్యార్థులు

మేడ్చల్ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తమ కళాశాలలో బీటెక్, ఎంబీఏలు పూర్తి చేసుకున్న విద్యార్థులు తమ చదువులను ఇంతటితో ఆపకుండా విదేశాలకు వెళ్లి ఉన్నత చదువులు చదవాలని మేడ్చల్ పట్టణం కిష్టాపూర్ ఎంఆర్‌ఈఎం కళాశాల చైర్మన్ వేముల మల్లారెడ్డి అన్నారు. బీటెక్, ఎంబీఏ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఆదివారం స్నాతకోత్సవ కార్యక్రమం నిర్వహించి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు కళాశాల తరఫున గుర్తింపుగా పతకాలను, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ వేముల మల్లారెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం బీటెక్, ఎంబీఏలు పూర్తిచేసుకున్న విద్యార్థులు ఇంతటితో చదువులు ఆపకుండా విదేశాలకు వెళ్లి మాస్టర్స్ చదివి జీవితంలో గొప్పగా స్థిరపడాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి వేముల కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ ఏ.శ్రీధర్‌రెడ్డి, డైరెక్టర్లు వేముల భరత్ సింహారెడ్డి, వేముల రాఘవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కొడంగల్ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని దుద్యాల మండలం హస్నాబాద్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఆదివారం 1989-1990 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు ఒకేచోట చేరారు. 34 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారు గత మధురస్మృతులనునెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంరెడ్డి, జగదీశ్‌కుమార్‌గౌడ్, దశరథ్, చంద్రశేఖర్, పూర్వ విద్యార్థులు కిషన్‌జీ, కృష్ణ, విజయ్, సదాశివలింగం, కృష్ణ, శాంత, సుచరిత, ఉమాదేవి, ప్రభావతి, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పడిపూజ



మహాపడి పూజలో పాల్గొన్న స్వాములు

వికారాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప పడిపూజ కార్యక్రమం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం కన్నెస్వామి నవీన్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈపూజా కార్యక్రమంలో స్వాములు పెద్దఎత్తున తరలి రాగా రవిపంతులు నేతృత్వంలో అయ్యప్ప పాటల బృందం అయ్యప్ప పాటలతో అలరించగా స్వాములు పేటతుల్లి ఆడారు. అనంతరం స్వాములకు భిక్ష ఏర్పాటు చేయగా స్వాములు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ఎప్పుడో?

- ధారూరులో అధికారుల తీరుపై అధికార పార్టీ నాయకుల విస్మయం
- ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారంటూ ఆవేదన



ధారూరు: గతేడాది యాసంగిలో ధారూరులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం

ధారూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంపై అధికార పార్టీ నాయకులతో పాటు, రైతులు సంబంధిత అధికారులపై తీవ్రంగా మండిపడుతున్నారు. గతంలో వానాకాలం, యాసంగిలో ధారూరులో వరి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ధాన్యంను కొనుగోలు చేసిన అధికారులు ఈసారి మాత్రం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయకపోవటంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా, మండలస్థాయి అధికారులు తీసుకుంటున్న ఏకపక్షంగా నిర్ణయాల వల్ల ధారూరు ప్రాంత రైతులకు నష్టం జరుగనుందని అధికార పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల ఒట్టెద్దు పోకడతో రైతులు ఇబ్బందిపడటమే గాక ప్రభుత్వం బద్నాం అవుతుందని కాంగ్రెస్ నాయకులు వాపోతున్నారు. అధికారులు ఎవరినీ సంప్రదించకుండా ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం వల్ల గ్రామాల్లో రైతులకు తాము సమాధానం చెప్పుకోలేకపోతున్నామని వాపోతున్నారు. అవసరమైన చోట ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఆదేశాలను అధికారులు పెడచెవిన పెట్టడం వల్ల తమకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయని కాంగ్రెస్ శ్రేణులు ఆవేదన చెందుతున్నారు. కాగా ధారూరు క్లస్టర్ పరిధిలో పండించిన ధాన్యాన్ని ఎక్కడికి తీసుకెళ్లి అమ్ముకోవాలని ధారూరు, అల్లీపూర్, అవుసుపల్లి, చింతకుంట, హరిదాసుపల్లి గ్రామాల రైతులు ప్రశ్నిస్తున్నారు. వరి కోతలు ప్రారంభమవుతున్నందున ధారూరులో ఇప్పటికైనా ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రైతులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

స్పీకర్ దృష్టికి తీసుకెళ్తాం



ధారూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంపై అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్తాం. జిల్లా, మండలస్థాయి అధికారులు స్థానిక నాయకులతో సంప్రదించకుండా ధారూరులో కొనుగోలు కేంద్రాన్ని తొలగించారు. గతంలో వానాకాలం, యాసంగి సీజన్‌లో ధారూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేశారు. ఈసారి ఏర్పాటు చేయకపోవడంతో రైతులు మమ్మల్ని ప్రశ్నిస్తున్నారు. అధికారులు తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాల వల్ల ప్రభుత్వం బద్నాం అవుతోంది.

-మాన్‌సింగ్, కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు, ధారూరు

జోరుగా ఇసుక దందా!

(5వ పేజీ తరువాయి)

దొరికితే దొంగ.. లేదంటే దొరలానే కొనసాగిస్తున్నారు ఇండ్లు , ఇతర నిర్మాణ పనులకు ఇసుక కావాలనే వారికి తెచ్చేందుకు నానా సాకులు చూపుతూ రేటు పెంచేస్తున్నారు. విపరీతమైన డిమాండ్ ఉన్నట్లు పరిస్థితిని కల్పించి ఇసుక వ్యాపారంతో కుబేరులవుతున్నారు. పరిగిలో టన్ను ఇసుకకు రూ.1600 నుంచి రూ.2000 వరకూ విక్రయిస్తున్నారు. దీంతో ఇసుక దొరకడం కష్టంగా ఉందని భావిస్తున్న నిర్మాణదారులు ఎంత ధర చెప్పినా కొనుగోలు చేయకతప్పడం లేదు.

రూ. లక్షల్లో ముడుపులు...

పరిగి ప్రాంతంలో ఇసుక అక్రమ దందా జోరుగా సాగుతోంది. ఇసుక మాఫియా నుంచి కొందరు అధికారులకు లక్షల్లో ముడుపులు అందుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు రెవెన్యూ, మైనింగ్, కిందిస్థాయి పోలీస్ సిబ్బంది అయితే ఏకంగా ఇసుక లారీలు వచ్చే సమయానికి వెళ్లి డబ్బులు వసూలు చేసుకుంటున్నాడని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. రెగ్యులర్‌గా నడిచే వ్యాపారుల వద్ద నుంచి ఒక్కో ట్రాక్టర్‌కు నెలకు రూ.10 నుంచి 20 వేల వరకు మామూళ్లు అందుతున్నట్లు సమాచారం. అదే లారీలకు అయితే డబుల్ వసూలు చేస్తున్నారు. రెగ్యులర్ వసూళ్లు కాకుండా కొత్తగా వచ్చిన లారీలు, ట్రాక్టర్ల నుంచి దొరికినప్పుడల్లా అందికాడికి దోచుకుంటున్నారు. గతంలో వే బిల్లులతో ఇసుక తీసుకొచ్చే వ్యాపారులు నష్టపోతున్నామని తహసీల్దార్, పోలీస్ కార్యాలయాల ఎదుట నిరసన వ్యక్తం చేయడానికి పూనుకున్నారు. అధికారులు వారికి నచ్చజెప్పి పంపించారు. తాజాగా నాలుగు రోజుల ఇసుక లారీలను పట్టుకుని సీజ్ చేశారు. పరిగి నుంచి గ్రామాల్లోకి ఇసుక తీసుకెళితే అదనంగా వసూలు చేస్తున్నారు. ఇటీవల పరిగి మండలం మాదారం, నస్కల్, గడిసింగాపూర్ ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని డబ్బులు తీసుకుని వదివేసినట్లు తెలిసింది. ఇలా కులకచర్ల, దోమ, చన్‌గోముల్‌లలో కూడా భారీగా పోలీసులు మామూళ్లు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.



పరిగి శివారులో నిలిపిన ఇసుక లారీ, ట్రాక్టర్



ఇటీవల పట్టుబడిన ఇసుక లారీలు

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవు



అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎక్కడి వరకు అనుమతి ఉంటే అక్కడే విక్రయించాలి. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే సీజ్ చేయిస్తాం. ఇసుక అక్రమ రవాణా గురించి మా దృష్టికి తీసుకవస్తే కేసులు నమోదు చేస్తాం. ఇసుక అక్రమ రవాణా కట్టడికి రెవెన్యూ అధికారులతో కలిసి స్పెషల్ డ్రైవ్ చేసి చర్యలు తీసుకుంటాం.

- ఎం.సంతోష్, ఎస్ఐ

క్రైం కార్నర్

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

మేడ్చల్ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా గుమ్మడి దల్ల మండలం వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సాయిలు తన భార్య లక్ష్మి(51)తో కలిసి పనినిమిత్తం మండలంలోని రావల్‌కోల్ గ్రామానికి వచ్చి తిరిగి బైక్‌పై తమ ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో మేడ్చల్ పట్టణం అత్వేల్లి రేకుల బావి వద్ద జాతీయ రహదారిపై మెట్‌పల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా లక్ష్మి చికిత్స పొందుతు మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి..



పెంటయ్య(ఫైల్)

కీసర రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య వివరాలిలా ఉన్నాయి. కుషాయిగూడలో నివాసముంటున్న నల్ల పెంటయ్య(50) బైక్‌పై తన స్వగ్రామమైన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం వరద రాజిపురానికి బయల్దేరాడు. ఈక్రమంలో కీసర ప్రధాన రహదారిలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్‌పంపు సమీపంలో ఓ టిప్పర్ లారీ అతివేగంగా వచ్చి పెంటయ్యను ఢీకొంది. దీంతో అతడి తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి ఒకరు..

నవాబుపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన నవాబుపేట మండలంలో జరిగింది. ఎస్ఐ అరుణ్‌కుమార్‌గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎల్లకొండ గ్రామానికి చెందిన అమరేందర్(35) శనివారం సాయంత్రం గ్రామ శివారులోని చెరువులో స్నానానికి వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులోపడి మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుక్కల దాడిలో ముగ్గురికి తీవ్రగాయాలు

బంట్వారం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బంట్వారం మండలకేంద్రంలో పిచ్చికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. చిన్నాపెద్దా, వృద్ధులు, మహిళలను కరిచి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. కుక్కల దాడిలో ఆదివారం ఒకేరోజు ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన ఐదేళ్ల బాలుడు అరవింద్ కుమార్, రేష్మ అనే యువతి, దానయ్య అనే వృద్ధుడు కుక్కల దాడిలో గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న 108సిబ్బంది అరవింద్ కుమార్, రేష్మను చికిత్స నిమిత్తం తాండూరు జిల్లా ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. దానయ్యకు శరీరం మొత్తం గాయాలు కావడంతో సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మండల కేంద్రంలో కుక్కల బెడద ఎక్కువైందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

యువత ఓటు నమోదు చేసుకోవాలి

తాండూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు నమోదు చేసుకోవాలని సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటర్‌కేంద్రాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. బీఎల్‌వోలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల సవరణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం తాండూరులో బీఎల్‌వోలు ఓటర్ లిస్టును ప్రదర్శించారు. అక్కడికి వచ్చిన ఓటర్లకు జాబితాను చూయించారు. 2025 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండబోయే వారికి కూడా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని అన్నారు. బీఎల్‌వోలు బంటు బిచ్చప్ప, కపిల్, గోపాల్, తదితరులు ఉన్నారు.

కొడంగల్: రెండు రోజుల పాటు కొడంగల్ నియోజకవర్గంలోని నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 275 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదులో ఫారం-6 ద్వారా 226, ఫారం-7 ద్వారా 61, ఫారం-8 ద్వారా 53మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఇంకా ఓటరుగా నమోదు చేసుకోని వారి కోసం ఈనెల 28వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. అర్హులైన యువతీ, యువకులు ఆన్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు.

ధారూరు: మండలంలో శని, ఆదివారాల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో 36 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ సాజిదాబేగం తెలిపారు. 18సంవత్సరాలు నిండిన వారు, జనవరి 1, 2025 వరకు 18 సంవత్సరాలు నిండబోయే వారు కొత్త ఓటర్లుగా నమోదుకు 47పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించామని ఆమె చెప్పారు. ఈ నెల 28 వరకు కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం ఉందని ఆమె తెలిపారు.



కొడంగల్: ఓటు నమోదు వివరాలు పరిశీలిస్తున్న తహసీల్దార్



ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమంలో పాల్గొన్న బీఎల్‌వోలు

కొనసాగుతున్న సర్వే



అంతారంలో సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్

తాండూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో సమగ్ర కుటుంబ సర్వే ఆదివారం కొనసాగింది. ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించారు. భూముల వివరాలను సేకరించే సమయంలో కొంత వరకు ఎందుకు అనే ప్రశ్నను ఎన్యూమరేటర్లు ఎదుర్కొన్నారు. జనం వేసిన ప్రశ్నలకు ఎన్యూమరేటర్లు సమాధానం ఇస్తూ ప్రశ్నావళిని నింపుతున్నారు. తాండూరు మండలంలో 4800 కుటుంబాలను గుర్తించగా 102 మంది చేత సర్వే నిర్వహిస్తున్నారు. మండలంలోని 33 గ్రామ పంచాయతీలు, 8 అనుబంధ గ్రామాలు ఈ సర్వేను మండల ఎంపీడీవో విశ్వ ప్రసాద్ పర్యవేక్షించారు.

సీఎంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి



సీఎంపై ఫిర్యాదు చేస్తున్న నాయకులు

వికారాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీఎంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు అశోక్ అన్నారు. వికారాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అసభ్యకరంగా మాట్లాడుతూ బెదిరింపులకు పాల్పడిన రేవంత్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఫక్రుద్దీన్, మల్లికార్జున్, మల్లేశ్ యాదవ్, శ్రీను, షైపాల్ నాయక్, మహేష్, సత్యనారాయణ, మల్లేశ్ యాదవ్‌లు ఉన్నారు.

నేటి నుంచి కార్తీక దీపోత్సవం

తాండూరు, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా కన్య పాఠశాల ఆవరణలో కార్తీక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 11, 12, 13 తేదీల్లో మూడు రోజుల పాటు దీపోత్సవం కార్యక్రమాన్ని శ్రీ హనుమాన్ దేవాలయం, శ్రీ బాల హనుమాన్ భజన మండలి, మహిళ కొచల మండలిలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. 11న విశేష దీపారాధన, మహా మంగళ నీరాజనం, తీర్థ ప్రసాద వితరణ, 12వ శ్రీ అభయ ఆంజనేయ స్వామికి 1108 తమలపాకులతో పూజ, హనుమాన్ చాలీసా కార్యక్రమం, 13న పార్వతీ పరమేశ్వర కల్యాణ మహోత్సవాలను నిర్వహిస్తున్నారు.

మహిళా హక్కుల కోసం పోరాడిన మహనీయుడు అంబేడ్కర్

ఘట్‌కేసర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళా హక్కుల కోసం పోరాడిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని న్యాయవాది టి.సంధ్య అన్నారు. అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్ చౌరస్తాలో గల అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు మీసాల అరుణ్ కుమార్, దాసు, నర్సింగరావు, రాందాస్, బాలయ్య పాల్గొన్నారు.

భవానీమాత ఆలయంలో ప్రత్యేకపూజలు

యాలాల , నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భవానీ మాత ఆలయంలో ఆదివారం నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. యాలాల మాజీ జడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్‌తోపాటు నాయకులు పలువురు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు భాస్కరాచారి, రాపోలు రాములు, ఉప్పరి యాదప్ప అన్నారం రాజు, చాకలి బాల్‌రాజ్, కిషన్‌రావు, ప్రభాకర్, మంగలి వెంకటయ్య పాల్గొన్నారు.

ఘనంగా మున్సిపల్ చైర్మన్ జన్మదిన వేడుకలు

కొడంగల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ మున్సిపల్‌చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మైనారిటీ నాయకులు కొడంగల్ పట్టణంలోని మహిబూబ్‌సుభానీ దర్గాలో ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎం.గౌసన్, సయ్యద్ వాహెద్ రాజ, సయ్యద్ ఇసాక్‌పాష, అబ్దుల్ జబ్బార్, రహీం, అహ్మద్‌ఖాన్, అబ్దుల్ కరీం పాల్గొన్నారు.


అభివృద్ధిలో భాగస్వాములవడం అభినందనీయం



డ్రైనేజీని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములవడం అభినందనీయని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ సూర్యనగర్ కాలనీలో ఆదివారం దాతల ఆర్థిక సాయంతో నిర్మించిన భూగర్భ డ్రైనేజీని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన కాలుష్యరహిత జూట్ బ్యాగులను కాలనీలో పంపిణీ చేశారు. ఈసందర్భంగా డ్రైనేజీ నిర్మాణానికి సహకరించిన దాతలు నర్సింహులు, ఆనంద్‌రెడ్డి, సాయి, శ్రీనివాసరావు, యాదగిరి, షకీల్, రుక్మారెడ్డిలను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వివాహ వేడుకలో పాల్గొన్న తిరుపతిరెడ్డి



వధూవరులను ఆశీర్వదిస్తున్న తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు

బొంరాస్‌పేట్/కొడంగల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ఆదివారం కొడంగల్ నియోజకవర్గంలో జరిగిన పలు వివాహాది, శుభ కార్యాల్లో పాల్గొన్నారు. బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ మెరుగు మంగమ్మ, పార్టీ జిల్లా కార్యదర్శి మెరుగు వెంకటయ్య నిర్వహించిన చిన్నారి తొట్టెల కార్యక్రమంలో పాల్గొన్నారు. అదే విధంగా సీనియర్ నాయకులు శేఖర్ కూతురి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అదే విధంగా కొడంగల్ మండలంలో జరిగిన పలు వివాహాది శుభ కార్యాల్లో కాంగ్రెస్ నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, కాంగ్రెస్ నాయకులు నర్సిములుగౌడ్, రాంచంద్రారెడ్డి, నర్సిములునాయుడు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం మండల కమిటీ



మున్నూరు కాపు సంఘం మండల నూతన కార్యవర్గం

కొడంగల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపు సంఘం కొడంగల్ తాలూకా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కొడంగల్ పట్టణంలోని మహదేవ శివాలయం ఆవరణలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బాకారం చంద్రశేఖర్, అధ్యక్షుడిగా హన్మంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా బానకారి శ్రీనివాస్, తూము సురేశ్, జీ.రమేశ్, ప్రధాన కార్యదర్శిగా బాకారం అరుణ్‌కుమార్, కార్యదర్శిగా బొంకూర్ అరవింద్, సహాయ కార్యదర్శిగా బొంకూర్ బాలకృష్ణ, కోశాధికారిగా కానుకుర్తి మణికంఠ, ప్రచార కార్యదర్శిగా కానుకుర్తి సతీశ్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బాకారం చంద్రశేఖర్, బాకారం మల్లయ్య, అరిగే అనంతప్రసాద్, కానుకుర్తి నర్సిరెడ్డి పాల్గొన్నారు.

ఆత్మహత్యకు కారణమైన భర్త, అత్తమామలను అరెస్టు చేయాలి

నవాబుపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా దస్తూరాబాద్ మండలం రేమోజిపేటకు చెందిన లత ఆత్మహత్యకు కారణమైన భర్త, అత్తమామలను అరెస్టు చేయాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ వికారాబాద్ జిల్లా కన్వీనర్ నాగభూషణం ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మృతురాలి తండ్రి పోగుల రాజేశం పౌరహక్కుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కోశాధికారి అని, ఆయన ఓ కేసు విషయంలో జైలులో ఉన్న ఆయనను విడుదల చేయాలన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

మేడ్చల్ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండమాదారం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చేపడుతున్న మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.